క్లుప్తంగా

ఎల్లార్తి దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు



ప్రత్యేక అలంకరణలో షేక్షావలి సమాధి

హొళగుంద: ఎల్లార్తి గ్రామంలో వెలిసిన షేక్షావలి, షాషావలి దర్గాలను గురువారం భక్తులు దర్శించుకుని భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. దర్గాలో మొక్కులు చెల్లించుకోవడానికి జిల్లా నుంచే కాకుండా కర్ణాటక, తెలంగాణ తదితర దూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. అలాగే మండల కేంద్రంలోని సాయిబన్న, చిణిగితాతా దర్గాలు, షిర్డిసాయిబాబా ఆలయాలను భక్తులు దర్శించుకున్నారు. దర్గా నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయండి



ఆలూరు జగనన్న కాలనీలోని ఇళ్ల నిర్మాణాలు పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి

ఆలూరు రూరల్: జగనన్న కాలనీల్లో నిర్మాణంలో ఉన్న ఇళ్లను త్వరగా పూర్తి చేయాలని జిల్లా హౌసింగ్ పీడీ సిద్ధలింగ మూర్తి అన్నారు. బుధవారం స్థానిక కర్నూలు–బళ్లారి రహదారిలోని ఉన్న జగనన్న కాలనీలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గడువులోగా గృహ నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. మండలంలో ఎన్ని లే అవుట్లు ఉన్నాయి. ఎన్ని ఇళ్లు మంజూరయ్యాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గుంతకల్లు రోడ్డులో ఉన్న ఎన్టీఆర్ గృహాలకు గతంలో పెండింగ్ బిల్లులు మంజూరు కావడంతో వాటిని పరిశీలించారు. ఆలూరు సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెల్దుర్తి: హైవే– 44పై మదార్‌పురం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహారాష్ట్రకు చెందిన శ్రావణ్ మహేశ్ గాయపడ్డాడు. గుంతకల్ నుంచి హైదరాబాద్‌కు కారులో వెళ్తున్న శ్రావణ్ మహేశ్ సంఘటనా స్థలంలో కారు పక్కకు ఆపి డ్రైవింగ్ సీటు నుంచి దిగుతున్న సమయంలో గుర్తుతెలియని వాహనం కారును, మహేశ్‌ను ఢీకొట్టింది. దీంతో శ్రావణ్ మహేశ్ ఎగిరి దూరంగా పడటంతో అతని నడుముకు, కాలికి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న హైవే పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రుడిని హైవే అంబులెన్స్ ద్వారా కర్నూలు ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు విచారిస్తున్నారు.

ఆయిల్ ట్యాంక్ ఢీకొని వ్యక్తి మృతి



మృతుడు గిడ్డయ్య (ఫైల్)

ఆదోని అర్బన్: పట్టణంలోని ఆలూరు రోడ్డులోని కల్లుబావి వీధికి చెందిన గిడ్డయ్య(54)ను ఆయిల్ ట్యాంకర్ లారీ ఢీకొట్టడంతో గురువారం మృతిచెందాడు. ట్రాఫిక్ ఏఎస్ఐ లక్ష్మన్న తెలిపిన మేరకు వివరాలు.. గిడ్డయ్య ఉదయం బహిర్భూమికి వెళ్లి ఇంటికి తిరిగొస్తున్న సమయంలో వెనుక నుంచి ఆయిల్ ట్యాంకర్ వచ్చి ఢీకొట్టింది. దీంతో గిడ్డయ్య అక్కడికక్కడే మృతిచెందాడన్నారు. మృతుడికి భార్య సరోజమ్మ, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు సంతానం. కుమారుడు ఈరన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

కోసిగి: మండల కేంద్రం కోసిగికు చెందిన ఇద్దరు వ్యక్తులు బైక్ పై అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తుండగా దాడులు చేసి పట్టుకున్నట్లు కోసిగి సెబ్ సీఐ మహేబూబ్ బాషా, ఎస్ఐ రమేష్‌బాబులు తెలిపారు. గురువారం గ్రామాల్లో పర్యటిస్తుండగా దేవరబెట్ట క్రాస్ రోడ్డు వద్ద కోసిగికు చెందిన కంపాటి మధు కృష్ణ, భూగేని రవిలు బజాజ్ పల్సర్ బైక్‌పై 768 ఒరిజనల్ చాయిస్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లు తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. రెండు బైక్‌లను, మద్యం బాటిళ్లను సీజ్ చేసి ఇద్దరిని అరెస్టు చేశామన్నారు.

కర్ణాటక ప్రాజెక్టులతో జిల్లాకు అన్యాయం

కర్నూలు(న్యూసిటీ): తుంగభద్ర నదిపై కర్ణాటక ప్రభుత్వం చేపడుతున్న బ్రిడ్జి, బ్యారేజ్ నిర్మాణంతో కర్నూలు జిల్లాకు తీవ్ర అన్యాయం జరుగుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సీపీఎం నాయకులు ఇరిగేషన్ సీఈ కబీర్‌పాషాను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ.. కర్ణాటక ఇరిగేషన్ మంత్రితో జిల్లా ఇరిగేషన్ అధికారులు, టీడీపీ ఎంపీ బస్తిపాడు రహస్య సమావేశాలు ఎందుకు నిర్వహించారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం మేల్కొని కర్ణాటక ప్రాజెక్టులను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు.



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు రంగన్న. తుగ్గలి మండలం పగిడిరాయి గ్రామం. ఉన్న 2 ఎకరాల్లో పత్తి, కంది పంట సాగు చేశాడు. 'ఎకరాకు రూ.30 వేలు పెట్టుబడి పెట్టించా. అరకొర వానలు కురిసినా పంట బాగానే ఉండింది. అయితే ఇటీవల కురిసిన వర్షాలతో పంట పొలంలో నీరు నిల్వ చేరి పంటంతా కుళ్లిపోతోంది. పెట్టుబడులకు చేసిన ఖర్చు కూడా చేతికందని పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నాడు.



నాకు ఉన్న 5 ఎకరాల పొలంలో ఈ ఏడాది పత్తి పంట సాగు చేశా. ఎకరాకు రూ. 50 వేల ప్రకారం ఖర్చయ్యింది. పంట పూత, కాయ దశలో ఉండగా..అధిక వర్షాలతో భూమిలో తేమ ఎక్కువైంది. ప్రస్తుతం వర్షాలు తగ్గు ముఖం పట్టినా నీటి జోముతో కాయ రాలిపోతోంది. అలాగే.. పంటకు గులాబీ పురుగు సోకింది. దీంతో పంటంతా ఎర్రగా మారిపోయింది. ఎన్ని మందులు కొట్టినా పురుగు అదుపులోకి రావడం లేదు. మరో వైపు నీటి జోము వదలడం లేదు. దీంతో పంటంతా నాశనమైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు పెద్దహ్యాటకు చెందిన రైతు శేఖన్న.

కష్టం మునిగింది..కన్నీరే మిగిలింది!

ఆగస్టు ముందు వరకు తీవ్ర వర్షాభావం కారణంగా సగానికి పైగా రైతులు పంటలు సాగు చేయలేదు. సీజన్ ముగిసినా చినుకు రాలకపోవడంతో పంటలు కోల్పోవాల్సి వస్తుందేమోనని మదనపడ్డారు. అయితే బంగాళాఖాతంలో ఏర్పడిన వాయిగుండం కారణంగా ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు సాగు చేసిన పంటలు నీటమునిగాయి. తేమ అధికమవడంతో పైర్లు కుళ్లుతున్నాయి. దీనికి తోడు తెగుళ్లు చుట్టుముట్టడం, కలుపు పెరిగిపోవడంతో ఏం చేయాలో రైతులకు పాలుపోనిస్థితి. అరకొరగా సాగైన పత్తి, మిరప, వేరుశనగ, కంది, ఉల్లి తదితర పంటలు చేతికందేది కష్టమేనని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- భారీ వర్షాలతో నీట మునిగిన పైర్లు
- అధిక వర్షాలతో కుళ్లుతున్న పంటలు
- ఖరీఫ్ ప్రారంభంలో తీవ్ర వర్షాభావం
- పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాల్లో 900 హెక్టార్లలో పంట నష్టం



ఆలూరు సమీపంలో పత్తి పంటలో నేటికీ నిలిచి ఉన్న వర్షపు నీరు



ఏరూరులో పంటను తలపిస్తున్న కలుపు



దేగులపాడులో మిరప పంటలో దెంత సాయంతో సొంతంగా కలుపు తొలగిస్తున్న రైతు మహేష్

ఆలూరు రూరల్: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ రైతులను కన్నీరు పెట్టించింది. జూన్, జూలై నెలల్లో తీవ్ర వర్షాభావం కారణంగా పంటలు సకాలంలో సాగు చేయలేకపోయారు. ముందస్తుగా సాగు చేసిన పైర్లలో ఎదుగుదల లోపించింది. ఎట్టకేలకు ఈ ఏడాది సీజన్ ప్రారంభంలో వర్షాలేక పంటల సాగు ఆలస్యమైంది. నియోజకవర్గంలో సాధారణ సాగు విస్తీర్ణం 82 వేల హెక్టార్లు కాగా.. ఈ ఏడాది 75 వేల హెక్టార్లలో రైతులు పత్తి, కంది, వేరుశనగ, మిరప తదితర పంటలు సాగు చేశారు. విత్తనం వేసిన తర్వాత వరుణుడు ముఖం చాటేశాడు. దీంతో పంటలు ఎండు దశకు చేరుకోవడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. చివరికి ఆగస్టు నెలలో ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు పంట పొలాల్లో నీరు నిలిచి సాగు చేసిన పంటలు దెబ్బతిన్నాయి. ఆలూరు నియోజకవర్గంలో 42 వేల హెక్టార్లలో పత్తి పంట సాగు చేశారు. పూత, కాయ దశలో అధిక వర్షపాతం నమోదు కావడంతో పొలాల్లో నీరు నిల్వ చేరి నేలలో తేమ శాతం ఎక్కువై పూత, పిందె రాలిపోయింది. ఇటీవల కురిసిన వర్షాలకు పత్తికొండ,ఆలూరు నియోజకవర్గాల్లో 900 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపారు.

తగ్గిన సాగు విస్తీర్ణం

ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో వర్షాలు రాకపోవడంతో పంట సాగు ఆలస్యమైంది. ఏటా పత్తికొండ,ఆలూరు నియోజకవర్గాల్లో 130 వేల హెక్టార్లకు పైగా పంటలు సాగయ్యేవి. వర్షాభావ పరిస్థితుల వల్ల, అడపాదడపా కురిసిన వర్షాలకు 75 వేల హెక్టార్లలో పత్తి,కంది,మిరప,వేరుశనగ,ఉల్లి వంటి పంటలు సాగు చేశారు.

కుళ్లుతున్న పంటలు..ప్రశ్నార్థకంగా ప్రత్యామ్నాయ పంటల సాగు

ఆగస్టు మొదటి వారం నుంచి తుఫాను ప్రభావంతో 20 రోజుల పాటు ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలతో పొలాల్లో భారీగా నీరు నిలిచిపోయి పైర్లు కుళ్లిపోతున్నాయి. ప్రత్యామ్నాయ పంటల సాగుపై ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించలేకపోవడం, అధికారులు అవగాహన కల్పించకపోవడంతో రైతులు సీజన్ కోల్పోయారు. సాధారణంగా అనావృష్టి లేదా అతివృష్టి వల్ల పంటలు నష్టపోతే వారికి ప్రత్యామ్నాయ పంటలు సాగుకు ప్రభుత్వం విత్తనాలు అందిస్తుంది. ఖరీఫ్,రబీ సీజన్ మధ్యలో పత్తికొండ డివిజన్‌లో పప్పుశనగ, జొన్న ప్రత్యామ్నాయ పంటలుగా వేస్తారు.

విజృంభిస్తున్న ×గులాబీ×..

గోరుచుట్టుపై రోకలి పోటు అన్న చందంగా.. ఒక వైపు అధిక వర్షాలతో పంటలు కుళ్లిపోతుంటే..మరో వైపు గులాబీ రంగు పురుగు విజృంభిస్తుండటంతో పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు. పత్తికొండ, ఆలూరు వ్యవసాయ సబ్ డివిజన్లలో దాదాపు 50 వేల హెక్టార్లలో పత్తి పంట సాగైంది. ఇందులో 20 వేల హెక్టార్లలో పత్తి పంటకు గులాబీ రంగు పురుగు సోకింది. ఒక్క హొళగుంద మండలంలోనే దాదాపు 4 వేల ఎకరాలకు పైగా గులాబీ రంగు పురుగు సోకినట్లు వ్యవసాయ శాస్త్రవేత్తలు మంగళవారం వెల్లడించారు.

కలవర పెడుతున్న కలుపు..

అధిక వర్షాలకు పంట పొలాల్లో కలుపు విపరీతంగా పెరిగిపోయింది. ఎకరాలో కలుపుతీయడానికి 50 మందికి పైగా కూలీలు అవసరమవుతున్నారని రైతన్నలు వాపోతున్నారు. పంట పొలాలు కనిపించనంతగా కలుపు పెరిగిపోవడంతో తొలగించడానికి అవస్థలు పడుతున్నారు. కూలి చెల్లించలేక కొందరు కుటుంబ సభ్యులతోనే రోజుకు కొంత చొప్పున తీసేస్తున్నారు.



పెద్దహ్యాటలో ఎర్ర తెగుళ్లు సోకిన పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు (ఫైల్)

నెల	సాధారణ వర్షపాతం	నమోదైన వర్షపాతం
ఆలూరు నియోజకవర్గంలో ఖరీఫ్ వర్షపాతం మి.మీలలో		
జూన్	68.8 మి.మీ	177.96 మి.మీ
జూలై	75.2 మి.మీ	14.16 మి.మీ
ఆగస్టు	100.మి.మీ	256 మి.మీ
పత్తికొండ నియోజకవర్గంలో ఖరీఫ్ వర్షపాతం మి.మీలలో		
నెల	సాధారణ వర్షపాతం	నమోదైన వర్షపాతం
జూన్	89.9 మి.మీ	190.00 మి.మీ
జూలై	91.4 మి.మీ	54.01 మి.మీ
ఆగస్టు	99.2.మి.మీ	201.1 మి.మీ



చిప్పగిరిలో కందిలో పరుచుకుపోయిన కలుపు

20న స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు

పత్తికొండ(తుగ్గలి) : ఈ నెల 20వ తేదీన పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపిక నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ రమేష్ తెలిపారు. స్థానిక ఎమ్మార్సీలో క్రీడా ఎంపికల నిర్వహణపై ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ.. 6010వ తరగతి విద్యార్థులు ఎంపికలో పాల్గొనవచ్చన్నారు. అండర్–14, 17 విభాగం కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగా, చెస్, షటిల్ బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ క్రీడలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఫుట్‌బాల్, క్రికెట్, త్రోబాల్, సాఫ్ట్‌బాల్ పోటీలు ఈనెల చివరి వారంలో జిల్లా స్థాయిలో ఎంపిక జరుగుతుందన్నారు. స్కూల్ గేమ్స్ మండల కోఆర్డినేటర్ ఆగోల రాజేష్, వ్యాయామ ఉపాధ్యాయులు మధుసూదన్, హనుమంతమ్మ, రుక్మిణి, రజియాబాను, దేవిబాయి, మధుబాబు, రాజశేఖర్, సునీల్‌కుమార్, గీతా, తులసి, మక్తుంవలి, సుధాకర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఈ-కేవైసీ తప్పనిసరి

తుగ్గలి : పంటలు సాగుచేసి ఈ-క్రాప్ చేయించుకున్న రైతులందరూ ఈ-కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని వ్యవసాయశాఖ మండల అధికారి పవన్ కుమార్ తెలిపారు. గురువారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో రైతులతో ఈ-కేవైసీ చేయించారు. ఈ-కేవైసీ చేయించుకుంటేనే ప్రభుత్వ రాయితీలు అందుతాయన్నారు. ఈనెల 14వ తేదీ లోపు ఆయా గ్రామాల్లో వ్యవసాయ సిబ్బందిని కలిసి రైతులు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని చెప్పారు. ఏఈఓ బాలసరస్వతి, ఎంపీఈఓలు స్రవంతి, లోహిత్ పాల్గొన్నారు.

సబ్సిడీపై డ్రిప్ పరికరాలు

మద్దికెర : బోర్లు, వ్యవసాయ బావుల కింద పండ్ల తోటలు సాగు చేసే రైతులకు 90 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు అందజేయనున్నట్లు ఏపీఓ నర్సిరెడ్డి గురువారం తెలిపారు. ఐదు ఎకరాలలోపు ఉంటే 90 శాతం, పది ఎకరాల్లోపు ఉంటే 70 శాతంతో మంజూరు చేస్తామన్నారు. వివరాలకు ఉపాధి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

నివాళి

ఆస్పరి: మండలంలోని చిగిళికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు తిప్పన్న (60) అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆలూరు ఎమ్మెల్యే బుసినె విరూపాక్షి, వైఎస్సార్‌సీపీ నాయకులు పెద్దయ్య, సుంకుర రామాంజనేయులు, తిమ్మప్ప గురువారం గ్రామానికి వెళ్లి తిప్పన్న మృత దేహంపై పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతుడి భార్య జయమ్మ చిగిళి గ్రామ సర్పంచ్, కుమారుడు రాధాకృష్ణ ఎంపీటీసీ సభ్యుడుగా వ్యవహరిస్తున్నారు.

ఖాదర్‌లింగస్వామి దర్గాకు పోటెత్తిన భక్తులు

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు, ప్రార్థనలు జరుపుకున్నారు. దీంతో దర్గా పరిసరా ప్రాంతాలన్ని భక్తులతో సందడిగా మారాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పిండి వంటలు వండి స్వామికి నైవెద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాష చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు. భక్తులకు అన్నదానం కార్యక్రమాన్ని చేపట్టారు.



దర్గాలో ఫాతెహాలు చేస్తున్న ధర్మకర్త

మురుగు వెళ్లే దారేదీ?

హొళగుంద: మండలంలోని పెద్దగోనెహాళ్ గ్రామ ఎస్సీ, బీసీ కాలనీల్లో సీసీ, డ్రైనేజీలు లేక వర్షపు, వృథా నీరు ప్రధాన వీధుల్లో ప్రవహిస్తుంది. దీంతో కనీసం నడవడానికి కూడా వీలులేకుండా పోయింది. సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని స్థానికులు పలు మార్లు అధికారులను కోరినా ఫలితం లేకపోయింది. మురుగు నీరు ఎక్కడికక్కడ నిలిచి దోమలకు ఆవాసంగా మారడమే కాకుండా దుర్వాసన వెదజల్లుతోంది. వర్షాకాలం కావడంతో సమస్య మరింత తీవ్రంగా మారడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదర్కొంటున్నారు. దోమద బెడద తీవ్రమైందని, వ్యాధులు చుట్టుముడుతున్నాయని, పారిశుద్ధ్య పనులు చేపట్టి డ్రైనేజీలు, సీసీ రోడ్లు నిర్మించాలని కోరారు.



పెద్దగోనెహాళ్ ఎస్సీ, బీసీ కాలనీలో వీధుల్లో ప్రవహిస్తున్న మురుగునీరు

బురద తొలగింపు

హొళగుంద: ఎల్లార్తి గ్రామం అయ్యప్పస్వామి ఆలయ సమీపంలో బురద పేరుకుని అధ్వానంగా మారడంతో పొలాలకు వెళ్లేందుకు రైతులు, కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో దర్గా మాజీ నిర్వాహకుడు మల్లికార్జున ఆధ్వర్యంలో బురద తొలగింపు పనులు చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు పొలాలకు వెళ్లే దాదాపు కిలోమీటర్ మేర దారి బురదమయంగా మారింది. కనీసం నడవలేనట్లుగా మారడంతో గురువారం గ్రామస్తులు శంక్రి, వీరేష్, కాసేసి, చిన్న గంగ, పాదులగుంట గాదిలింగ సహకారంతో ప్రొక్లెయిన్, ట్రాక్టర్లతో బురదను తొలగించి గ్రావెల్ వేసి చదును చేశారు. రాకపోకలకు దారి బాగవడంతో గ్రామస్తులు, రైతులు వారిని అభినందించారు.



ట్రాక్టర్‌తో బురదను తొలగిస్తున్న దృశ్యం

ఏచూరి మరణం తీరనిలోటు

ఆలూరు రూరల్: దేశం ఓ మంచి నాయకుడిని కోల్పోయిందని ఆలూరు ఎమ్మెల్యే బి. విరూపాక్షి పేర్కొన్నారు. గురుశారం సీపీఎం నేత సీతారం ఏచూరి మృతికి సంతాపం తెలిపారు. విద్యార్థి సంఘం నాయకుడి నుంచి దేశ రాజకీయాల్లో తనదైన పాత్ర పోషించారని కొనియాడారు. ఆయన మృతి పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నట్లు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు.

ఆలూరు: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అకాల మరణంతో తమ పార్టీ గొప్ప నాయకుడిని కోల్పోయామని నియోజకవర్గ సీపీఎం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద కొవ్వొత్తులతో సంతాపం వ్యక్తం చేశారు. నారాయణస్వామి, హనుమంతు, కృష్ణ, రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

దేవనకొండ: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి మృతి తీరని లోటని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.మద్దిలేటి శెట్టి, మండల ప్రధాన కార్యదర్శి ఎం.నరసారావు అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏచూరి అకాల మరణంపై సంతాపం తెలిపారు. వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి కమ్యూనిస్ట్ ఉద్యమానికి ఆకర్షితులై జాతీయస్థాయికి ఎదిగి దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారన్నారు. శ్రామికుల వాణిని పార్లమెంటులో, బయట సమర్ధవంతంగా వినిపించారన్నారు.

ఆస్పరి: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి పట్ల జిల్లా ఎస్ఎఫ్ఐ మాజీ ప్రధాన కార్యదర్శి, సీనియర్ జర్నలిస్టు వెంకన్న గురువారం ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు. ఏచూరి మరణం వామపక్ష ఉద్యమానికి తీరనిలోటని సీపీఐ మండల కార్యదర్శి రాజాసాహెబ్ అన్నారు.



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న దృశ్యం

కోలుకోలేక రైతు మృతి

ఆస్పరి: ఆత్మహత్యకు యత్నించిన మండలంలోని బిల్లేకల్లు గ్రామానికి చెందిన రైతు సంకన్న (38) కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మన్న తెలిపారు. వివరాలు.. మృతుడు 3ఎకరాల సొంత పొలంలో భార్య, ఇద్దరు కుమారులతో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రెండు సంవత్సరాలు నుంచి పత్తి పంటకు పెట్టిన పెట్టుబడులు రాక అప్పులు అధికమవడంతో ఎలా చెల్లించాలో తెలియక మనస్థాపంతో ఆగస్టు 27న పొలంలో పురుగులు మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా.. కుంటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆదోని ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలు జనరల్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందతూ కోలుకోలేక మృతి చెందినట్లు చెప్పారు. అప్పుల వివరాలు కుటుంబ సభ్యులు వివరించలేదని, కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ పేర్కొన్నారు.

డ్రైనేజీ పనులు ప్రారంభం

ఆలూరు: పట్టణంలోని గాంధీ నగర్ నుంచి ఇందిరా గాంధీ నగర్ కాలనీ వరకు డ్రైనేజీలు ఏర్పాటు చేస్తామని ఇన్‌చార్జ్ డీఎల్‌పీఓ ప్రకాష్‌నాయుడు, స్థానిక మేజర్ పంచాయతీ సర్పంచ్ అరుణాదేవి తెలిపారు. గురువారం గాంధీనగర్‌లో రూ. 20లక్షలతో డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ..కాలనీ వాసులకు గత కొన్నేళ్ల నుంచి డ్రైనేజీలు లేనందున ఇబ్బందులు పడ్డారని, పనులు పూర్తయితే అవస్థలు తప్పుతాయని చెప్పారు.

16న పుట్లూరులో పొట్టేళ్ల పోటీలు

కృష్ణగిరి: మండలంలోని పుట్లూరు గ్రామంలో మారెమ్మ ఉత్సవాల సందర్భంగా ఈ నెల 16వ తేదీన పొట్టేళ్ల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు అదే రోజు ఉదయం రూ.200 చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. గెలుపొందిన పొట్టేళ్ల యజమానులకు దాతల సహకారంతో వరుసగా రూ.15 వేలు, రూ.12 వేలు, రూ.10 వేలు, రూ.8 వేల నగదు బహుమతి అందజేస్తామని చెప్పారు. వివరాలకు సెల్.. 7093777220 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నులిపురుగులపై అవగాహన

మద్దికెర : విద్యార్థులు ఐరన్ మాత్రలు వేసుకుంటే నులిపురుగులు నశించి, రక్తహీనత తలెత్తకుండా ఆరోగ్యంగా ఉంటారని ప్రభుత్వ వైద్యాధికారులు రాగిణి, శ్రీలక్ష్మి తెలిపారు. మండలంలోని బురుజుల గ్రామంలో నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించారు. మలేరియా, డెంగీ నివారణకు పరిసరాలతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. మురుగు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. దోమల నివారణకు మందులు స్ప్రే చేయించారు. సీహెచ్ఓ నిరంజన్‌బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

ఆలూరు: ఎస్‌బీఐ ఖాతాదారుల కోసం మండలంలోని ఎం.కొట్టాల గ్రామంలో ఖాతాదారుల సర్వీస్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని మొలగవెల్లి గ్రామ ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ రవికుమార్ తెలిపారు. గురువారం గ్రామంలో సర్వీస్ సెంటర్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బ్యాంక్ సేవలన్నీ సర్వీస్ సెంటర్‌లో అందుతాయని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీఎస్పీ జిల్లా మేనేజర్ వీరప్రసాద్,సర్వీస్ పాయింట్ నిర్వహకురాలు సుజాత పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

పత్తికొండ(తుగ్గలి) : అధిక వర్షాలతో పంటలు నష్టపోయిన రైతుల పంట రుణాలు మాఫీ చేసి ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పత్తికొండలోని స్వగృహంలో ఆమె మాట్లాడారు. పత్తికొండ, మద్దికెర, తుగ్గలి మండలాల్లోని పలు గ్రామాల్లో అధిక వర్షాలకు వేలాది ఎకరాల్లో పత్తి, వేరుశనగ, సజ్జ, జొన్న, ఆముదం, కంది, టమాట, మిరప పంటలు దెబ్బతిని అన్నదాతలు తీవ్రంగా నష్ట పోయారన్నారు. పెట్టుబడులు నీళ్లపాలై అన్నదాతలు తీవ్ర ఆందోళనలో ఉన్నారన్నారు. పంట నష్ట నమోదు నిబంధనలు సవరించి ఏ మేరకు నష్టం జరిగిందో ఎన్యూమరేషన్ చేసి నష్టపరిహారం చెల్లించాలన్నారు. పంటలు నష్ట పోయిన ప్రతి రైతుకు ఎకరాకు రూ.20వేల చొప్పున పరిహారంతో పాటు బీమా అందేలా చూడాలన్నారు. అలాగే బ్యాంకుల్లో ఉన్న పంట రుణాలను పూర్తిగా మాఫీ చేయాలని కోరారు. ఎంపీపీ నారాయణదాసు, శ్రీరంగడు, బాబుల్‌రెడ్డి, నాగరాజు, నాగభూషణరెడ్డి, కేశవరెడ్డి, గోపాల్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి, హనుమంతరెడ్డి, నాగరాజు, మనీంద్ర, రవి, శ్రీరాములు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

ముగిసిన హ్యాండ్‌బాల్ పోటీలు

కర్నూలు (టౌన్): నగరంలోని స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న జిల్లా స్థాయి బాలబాలికల అంతర్ పాఠశాలల హ్యాండ్‌బాల్ పోటీలు గురువారం సాయంత్రం ముగిశాయి. బాలుర విభాగంలో సెయింట్ జోసెఫ్ పాఠశాల జట్టు, బాలికల విభాగంలో డోన్ కేజీబీవీ జట్లు విజేతలుగా నిలిచాయి. స్పోర్ట్స్ ప్రమోటర్ శ్రీధర్‌రెడ్డి పాల్గొని విజేతలకు ట్రోఫీలు, పతకాలు అందజేశారు. బాలుర విభాగంలో సెయింట్ జోసఫ్ పాఠశాల (మొదటి), గూళ్యం జెడ్పీ స్కూల్ (ద్వితీయ), ఆదర్శ విద్యా మందిర్ (తృతీయ), బాలికల విభాగంలో డోన్ కేజీబీవీ (మొదటి), మాంటిస్సోరి స్కూల్ (ద్వితీయ), గూళ్యం జెడ్పీ స్కూల్ (తృతీయ) స్థానాల్లో నిలిచాయి. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళం

పత్తికొండ(తుగ్గలి) : విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు సీపీఐ ఆధ్వర్యంలో సేకరించిన రూ.70వేల విలువజేసే నిత్యావసర సరుకులు, వస్త్రాలను పంపేందుకు గురువారం సిద్ధం చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి రామచంద్రయ్య మాట్లాడుతూ.. సేకరించిన వాటిని విజయవాడకు తరలించి బాధితులకు నేరుగా అందజేస్తామన్నారు. భీమలింగప్ప, నబిరసూల్, రాజాసాహెబ్, రామాంజినేయులు, గురుదాస్, కారన్న, నెట్టికంటయ్య, వెంకటరామిరెడ్డి, గిడ్డయ్యగౌడ్, మాదన్న, నాగేంద్ర, నాగిరెడ్డి పాల్గొన్నారు. అలాగే.. మద్దికెర, తుగ్గలి, పత్తికొండ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాళ్లు పద్మజ, కాంతమ్మ, నాగలక్ష్మి, చిట్టెమ్మ పట్టణంలోని కామ్రేడ్ ఈశ్వరరెడ్డి భవన్‌లో సీఐటీయూ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, రంగారెడ్డి, గోపాల్, శ్రీరాములుకు రూ.12వేల నగదును అందజేశారు.

వెల్దుర్తి: విజయవాడ వరద బాధితుల సహాయార్థం పట్టణంలోని పద్మ విద్యావికాస్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, యాజమాన్యం గురువారం సీఎం సహాయ నిధికి రూ.20వేలు డీడీ తీసి పంపారు.



నిత్యావసర సరుకులతో రామచంద్రయ్య